## క్లుప్తంగా

### కనకదుర్గ ఆలయంలో వైభవంగా పూజలు



కనకదుర్గ ఆలయంలో సర్వతోభద్ర మండపారాధన నిర్వహిస్తున్న వేద పండితులు

బోట్‌క్లబ్: స్థానిక సినిమారోడ్డులోని సంతచెరువు కనకదుర్గమ్మ దివ్య ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం గణపతి పూజ, సర్వతోభద్ర మండపారాధన, ఉదకశాంతి, వేదపారాయణ, యంత్రజపాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత జొన్నాడ చినబాబు మాట్లాడుతూ ఆలయ నిర్మాణం దాదాపు పూర్తయ్యిందన్నారు. ఈ నెల 15న విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందన్నారు.

### ఎన్‌ఐఏ దాడులను నిరసిస్తూ ధర్నా

కాకినాడ సిటీ: ఈ నెల రెండో తేదీన రెండు తెలుగు రాష్ట్రాల్లో లాయర్లు, కవులు, కళాకారులు, ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్న నాయకుల ఇళ్లపై ఎన్‌ఐఏ దాడులు చేయడాన్ని నిరసిస్తూ ఉపా రద్దు పోరాట కమిటీ ఆధ్వర్యంలో కాకినాడలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఉపా లాంటి నిర్బంధ చట్టాలను, ఎన్‌ఐఏ లాంటి కేంద్ర ప్రభుత్వ జేబు సంస్థలను రద్దు చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, బచ్చల కామేశ్వరరావు, టి.నూకరాజు, పి పావన ప్రసాద్, దూసర్లపూడి రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కాకినాడ సిటీ: వచ్చేనెల హైదరాబాదులో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేసేందుకు మాదిగలంతా సిద్ధం కావాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇన్‌చార్జి వల్లూరి సత్తిబాబు మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుల సమావేశం కాకినాడ జగన్నాథపురంలోని గోలీలపేటలో సోషలిస్టు పార్టీ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి పలివెల నవీన్ మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీల్లో ఉన్న 59 ఉప కులాలకు సామాజిక న్యాయం చేయాలని 29 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న మందకృష్ణ మాదిగ ఈ నెల ఏడో తేదీన విశ్వరూప మహా పాదయాత్ర అల్లంపూర్ నుంచి ప్రారంభించనున్నట్టు తెలిపారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. మిరియాల వీరబాబు, దూలపల్లి కృష్ణ, నరుకుర్తి రాజు, కొమ్ముకూరి నాగేశ్వరరావు, మోతుకూరి వరలక్ష్మి, తుమ్మలపల్లి చిన్న తదితరులు పాల్గొన్నారు.

### పోలీసుల జోక్యంతో జీజీహెచ్‌లో దుకాణం మూసివేత

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో సక్రమంగా అద్దెలు చెల్లించని దుకాణాలను కలెక్టర్ ఆదేశాల మేరకు సూపరింటెండెంట్ లావణ్యకుమారి బుధవారం మూయించారు. ప్రసూతి విభాగం ఎదుట ఉన్న టెలిఫోన్ బూత్ పేరుతో అనుమతులు పొంది మినీ మార్టు నిర్వహిస్తున్న చొల్లంగి వేణుగోపాల్ అత్యధికంగా అద్దె బకాయిపడ్డారు. సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ పుష్కరరావు, ఆర్ఎంవో డాక్టర్ రాహుల్‌ల ఆధ్వర్యంలో బృందం సెక్యూరిటీ సిబ్బంది సహకారంతో మూయించేందుకు విఫలయత్నం చేశారు. దీంతో అధికారుల పిలుపుతో పోలీసులు జోక్యం చేసుకుని దుకాణాన్ని మూయించారు.

# ముస్లింలకు అన్నింటా సముచిత ప్రాధాన్యం

- ఎంపీ వంగా గీత
- అక్బర్ ఆజమ్ కమ్యూనిటీ హాల్ ప్రారంభం
- పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎమ్మెల్సీ పద్మశ్రీ



కమ్యూనిటీ హాలు ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ గీత, చిత్రంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తదితరులు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వంలోను, పార్టీలోను, సంక్షేమంలోను అన్నివిధాలా సముచిత ప్రాధాన్యతం ఇచ్చారని పార్లమెంట్ సభ్యురాలు వంగా గీత పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురం మేకల కబేళా సమీపంలో రూ.1.55 కోట్లతో నూతనంగా నిర్మించిన అక్బర్ ఆజమ్ ముస్లిం కమ్యూనిటీహాల్‌ను ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ బుధవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ గీత మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ముస్లింలను అన్ని విధాలా విస్మరిస్తే జగన్ ప్రభుత్వం వారికి అగ్రాసనం వేసిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయని గత పాలకుల తీరువల్ల ప్రజల్లో రాజకీయాలపై ఏర్పడ్డ చులకన భావాన్ని చెరిపివేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి ఒక్క హామీనీ అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ మహానేత డాక్టర్ వైఎస్సార్ ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్లతో ఎంతో మంది ముస్లిం యువత ఇప్పుడు ఉన్నతస్థాయికి ఎదిగారన్నారు. తండ్రిబాటలో తనయుడు జగన్ కూడా మైనార్టీలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారన్నారు. ముఖ్యంగా కాకినాడలో ముస్లిం మైనార్టీల కోసం రెండు మసీదులను నిర్మించుకోవడంతో పాటు షాదీఖానాలు, మదర్సాలు, ఉన్న మసీదుల అభివృద్ధి వంటి ఎన్నో కార్యక్రమాలు చేసుకోగలిగామన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, అక్బర్ మసీదు అధ్యక్ష, కార్యదర్శులు బబ్లు, టిప్పుసుల్తాన్, పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇమామ్ గౌస్ మోహిద్దీన్ స్వాగతోపన్యాసం చేశారు.

# ఎన్‌సీసీతో విద్యార్థులలో ఆత్మవిశ్వాసం

- ఎంపీ వంగా గీత



క్యాడెట్‌ను సత్కరిస్తున్న ఎంపీ గీత, వీసీ డాక్టర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు: ఎన్‌సీసీలో విద్యార్థులు చేరాలని, తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం, ధైర్య సాహసాలు పెంపొందుతాయని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీలో తల్ సైనిక్, ఆలిండియా వాయు సైనిక్ క్యాంపులో ప్రత్యేక శిక్షణ పొంది ప్రతిభ చూపిన 41 మంది క్యాడెట్‌లను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చదువుకున్న రోజుల్లో తాను ఎన్‌సీసీ క్యాడెట్‌గా చేరానని, జీవితంలో ఉన్నత స్థితికి, ముఖ్యంగా మానసిక దృఢత్వానికి ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ యునివర్సిటీ సిలబస్‌లో ఎన్‌సీసీ చేర్చి క్యాడెట్‌లకు క్రెడిట్ పాయింట్లు ప్రవేశపెట్టామని, తద్వారా విద్యార్థులు ఆసక్తిగా చేరతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ సవ్యసాచి దాస్, రిజిస్ట్రార్ సుమలత పాల్గొన్నారు.

# బాలికల హక్కులను కాపాడాలి



అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న పీడీ ప్రవీణ



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న సీడీపీఓ లక్ష్మి

- ఐసీడీఎస్ పీడీ ప్రవీణ
- ఘనంగా బాలికా దినోత్సవం

కాకినాడ సిటీ: బాలికల హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సవాళ్లను తెలియజేయడానికి అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఏటా అక్టోబర్ 11న నిర్వహిస్తున్నట్లు జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ సాధికారిత అధికారి కె.ప్రవీణ అన్నారు. బుధవారం కాకినాడ పైడా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, అనర్థాలను నివారించి, వారి హక్కులను తెలియజేయడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఎవరైనా ఈ వివాహాలను ప్రోత్సహించినా, సహకరించిన రూ.లక్ష జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష ఉంటుందని పీడీ అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజు, జిల్లా బాలల పరిరక్షణాధికారి సీహెచ్ వెంకటరావు, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జీకేఎస్ విశ్వనాథ్, సఖి వన్‌స్టాఫ్ సెంటర్ అడ్మిన్ శైలజ, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ ప్రవీణను విద్యార్థినులు, లెక్చరర్లు సత్కరించారు.

**బాలికలకు సామాజిక స్పృహ అవసరం**

కరప: బాలికలు విద్యతో పాటు సామాజిక స్పృహ పెంపొందించుకోవాలని మండల భీమాబాయి మహిళా మండలి ప్రతినిధి జి.చంద్రకళ పేర్కొన్నారు. పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణ (ఫకీ రావు) జెడ్పీ ఉన్నతపాఠశాలలో బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం ఎస్ఎస్ఎస్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు టి.వెంకట్రావు, మహిళామండలి ప్రతినిధులు డి.అర్జునరావు, డి.లోవకుమారి, కె.లోవరాజు, ఎం.నూకలక్ష్మి పాల్గొన్నారు.

**కిశోర బాలికలకు అవగాహన**

కాకినాడ రూరల్: అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు మండలంలోని సర్పవరం హైస్కూల్‌లో కిశోర బాలికలకు పోషకాహారంపై బుధవారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ కాకినాడ రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ వై.లక్ష్మి, సూపర్‌వైజర్లు పాల్గొని మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందన్నారు. బాల్యం నుంచి బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు.

# ప్రయాణికుడికి పరిహారం ఇవ్వాల్సిందే

- వినియోగదారుల కమిషన్ తీర్పు

కాకినాడ లీగల్: కాకినాడ రూరల్ వలసపాకలకు చెందిన కంటిపూడి వెంకటరాజు 2022లో పిఠాపురం ఆర్టీసీ బస్సు స్టాండ్ నుంచి కాకినాడ సర్పవరం వరకు టికెట్ తీసుకున్నారు. ఆయన బస్సు ముందు సీట్లో కూర్చున్నారు. ఆ సీటు పక్కనే గేర్ బాక్స్ ఉంది. అయితే దానిపై ఉండాల్సిన భద్రత మూత లేకపోవడంతో వెంకటరాజు ఎడమకాలు దానిలో పడి అతని షూస్, ప్యాంటు పాడయ్యాయి. దీనిపై వెంకటరాజు కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై డిపో మేనేజర్ సరిగ్గా స్పందించకపోవడంతో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. వెంకటరాజుకు రూ.10 వేలు నష్ట పరిహారానికి, రూ.20 వేలు మానసిక ఒత్తిడికి, రూ.5 వేలు కోర్టు ఖర్చుల కింద ఆర్టీసీ యాజమాన్యం ఇవ్వాలని కమిషన్ అధ్యక్షుడు చెరుకూరి రఘుపతి వసంత్ కుమార్, సభ్యులు చెక్కా సుశీ, చాగంటి నాగేశ్వరరావు బుధవారం తీర్పు చెప్పారు.

### నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ప్రశాంతిశ్రీ



బాధ్యతలు చేపట్టిన ప్రశాంతిశ్రీని అభినందిస్తున్న అధ్యాపకులు

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ప్రశాంతిశ్రీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంగ్లిషు డిపార్టుమెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆమె గతంలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి విదేశీ పర్యటన నిమిత్తం 6 నెలలు సెలవు పెట్టడంతో ఆమె స్థానంలో ప్రశాంతిశ్రీని ఇంచార్జిగా నియమిస్తూ వర్సిటీ వీసీ ప్రొఫెసరు కె.పద్మరాజు ఉత్తర్వులు ఇచ్చారు.

# ఆకట్టుకుంటున్న హస్తకళా ప్రదర్శన



ప్రదర్శనలో ఆకట్టుకుంటున్న వస్తువులు

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్ డీసీసీబీ బ్యాంకు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన చేనేత హస్త కళాప్రదర్శన నగర ప్రజలను ఆకట్టుకుంటోంది. చేనేత కళాకారులు రూపొందించిన కళంకారీ చీరలు, కళంకారీ వస్త్రాలు, బ్యాంగిల్స్, కళంకారీ డ్రెస్ మెటీరియల్, ఖాదీ షర్టులు, జైపూరి బెడ్‌షీట్స్, పానిపట్ సోఫా కవర్లు, మైసూర్ పెయింటింగ్స్, టెర్రాకోటా ఐటమ్స్, నాగాలాండ్ డ్రై ఫ్లవర్స్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యుయలరీ, లేడీస్ డ్రెస్ మెటీరియల్, ఢిల్లీ రెడీమేడ్ గార్మెంట్స్, లేడీస్ చెప్పల్స్, బెంగాలీ శారీస్, సహరన్‌పూర్ ఫర్నీచర్, లేడీస్ టాప్స్, హైదరాబాద్ పెరల్స్, శారీస్, ఫిరోజ్‌బాద్ గిఫ్ట్ ఐటమ్స్ ఈ ప్రదర్శనలో ఉన్నాయి. నిత్యం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటలు వరకూ ఈ ప్రదర్శన ఉంటుందని మేనేజర్ వై.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. కళాకారులచే రూపొందించిన చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి కళాకారులకు చేయూత ఇవ్వాలన్నారు. ప్రదర్శన 50 వేల రకాల వస్తువులు ఉన్నాయన్నారు. శెలవు రోజుల్లో కూడా ప్రదర్శన, విక్రయాలు ఉంటాయన్నారు.

### జిల్లాస్థాయి రన్నింగ్ పోటీలకు కరప విద్యార్థి



మహా సత్యసాయి చరణ్

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి వాసంశెట్టి మహా సత్య సాయి చరణ్ జిల్లా రన్నింగ్ జట్టుకు ఎంపికైనట్టు హెచ్ఎం యు.లీలా మనోహర్ బుధవారం తెలిపారు. కాకినాడలోని జిల్లా క్రీడామైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలలో పాల్గొన్నట్టు ఆయన చెప్పారు. సాయిచరణ్ అండర్-14 విభాగంలో 200, 400 మీటర్లలో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైనట్టు తెలిపారు. వచ్చే నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తాడని హెచ్ఎం తెలిపారు. చరణ్‌ను, తర్ఫీదు నిచ్చిన పీడీలు కె.శ్రీనివాసరావు, కృష్ణ, చంద్రశేఖర్‌లను పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

# న్యాక్ ఏ-ప్లస్ సాధన అభినందనీయం

- జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజుకు మంత్రి బొత్స సత్కారం



వీసీ ప్రసాదరాజును సత్కరిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకేకు న్యాక్ ఏ ప్లస్ సాధించిన నేపథ్యంలో విజయవాడలో ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వీసీ ప్రసాదరాజును సత్కరించారు. రాష్ట్రంలో న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు సాధించిన వర్సిటీ, కళాశాలల ప్రతినిధులను రసస్వాద ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజును సత్కరించి రాష్ట్ర స్థాయిలో సాంకేతిక వర్సిటీలో కీలకంగా ఉన్న జేఎన్‌టీయూకేకు ఈ హోదా రావడం సంతోషమని, భవిష్యత్‌లో విదేశీ వర్సిటీలతో ఎంవోయూలకు అవకాశం ఉంటుందని మంత్రి బొత్స పేర్కొన్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ రామ్మోహనరావు, ఉమామహేశ్వరి దేవి, రిజిస్ట్రార్ సుమలత పాల్గొన్నారు.

# హరీష్ సేవలు అభినందనీయం



తలాటం హరీష్‌ను సత్కరిస్తున్న డీఎస్‌ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హరీష్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు రూ.3 లక్షలతో స్థానిక జిల్లా క్రీడామైదానంలో ఆధునీకరించిన డీఎస్‌ఏ టాయిలెట్లను బుధవారం వినియోగంలోకి తీసుకువచ్చారు. చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ మరుగుదొడ్ల ఆధునీకరణ విషయాన్ని ట్రస్ట్ అధినేత టి.హరీష్‌కు వివరించిన మేరకు ఆయన సత్వర చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా హరీష్‌ను వారు సత్కరించారు. రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు జార్జి, జిల్లా అధ్యక్షుడు రవిరాజు, పీడీలు రంగారావు, హరిబాబు, నూకరాజు, ఎస్‌జీఎఫ్ఐ ప్రసాద్, డీఎస్‌ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

### నర్సింగ్ ఎన్నికల ప్రక్రియలో వివాదం

కాకినాడ క్రైం: త్వరలో ఎన్నికలకు సన్నద్ధమవుతున్న ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ (ఏపీజీఎన్ఏ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విభాగంలో ముసలం రాజుకుంది. ఎన్నికల్లో తమను అభ్యర్థులుగా పోటీ చేయనీయకుండా కుట్ర చేశారని పలువురు నర్సులు, సంఘ మాజీ నాయకులు ఆరోపించారు. రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ ఆదేశాల మేరకు జిల్లాలో సభ్యత్వ నమోదును పర్యవేక్షిస్తున్న శ్యామల, మేరీలు నిబంధనలు అతిక్రమించి తమ సొంత ప్యానల్ సభ్యులు మాత్రమే ఎంపికయ్యేలా కుట్ర పన్నారన్నారు. అభ్యర్థులుగా పోటీ చేయాలంటే ఐదేళ్ల సభ్యత్వ నమోదు పొందాలని, గడువు ముగిసే వరకు ఆ విషయం ఎవరికీ చెప్పకుండా తన వర్గానికి చెందిన ఓ ఐదుగురికి మాత్రమే వ్యక్తిగతంగా చెప్పి వారి చేతే సభ్యత్వాన్ని కట్టించారన్నారు. ఈ కుట్రతో పాటు రసీదులు ఇవ్వకుండానే మూడేళ్ల సభ్యత్వ నమోదు రుసుములు వసూలు చేశారన్న అంశాన్ని రాష్ట్ర ఎన్నికల అధికారికి లిఖితపూర్వక ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఈ మేరకు బుధవారం 120 మంది నర్సుల సంతకాలతో తమ ఫిర్యాదును రిజిస్టర్డ్ పోస్టులో పంపినట్లు హెడ్ నర్సులు ధనలక్ష్మి, విజయలక్ష్మి, స్టాఫ్ నర్సులు ప్రమోదా ఆధ్వర్యంలోని నర్సుల బృందం పేర్కొంది.

### యూనివర్సిటీ ఆఫ్ డెమోక్రసీ ఫౌండేషన్ ఏర్పాటు

బోట్‌క్లబ్: యూనివర్సిటీ ఆఫ్ డెమోక్రసీ ఫౌండేషన్ నూతన ట్రస్ట్ ప్రారంభమైంది. స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్‌లో బుధవారం రాత్రి ఫౌండేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ట్రస్ట్ చైర్మన్‌గా డాక్టర్ గెంజి అబ్బయ్య, సభ్యులుగా ఆలపాటి శ్రీనివాస్, భోగాబత్తిన మురళీ కృష్ణయ్య, గుర్రం శివకుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అబ్బయ్య మాట్లాడుతూ సామాజిక ప్రయోజనం కోసం ప్రజాస్వామ్యంలో మెరుగైన మార్పు, సంస్కరణను తీసుకురావడానికి ఈ ఫౌండేషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

# కరపలో సోలార్ లైట్లు



కరపలో నెడ్‌క్యాప్ డైరెక్టర్ విజయలక్ష్మిని కలసిన జిల్లా మేనేజర్ సత్యనారాయణ

కరప: గ్రామంలోని ప్రధాన కూడళ్లల్లో సోలార్ విద్యుత్‌లైట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నెడ్‌క్యాప్ డైరెక్టర్ సాదే విజయలక్ష్మి తెలిపారు. నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ జి.సత్యనారాయణ బుధవారం కరపలో డైరెక్టర్ విజయలక్ష్మిని కలసి సోలార్ విద్యుత్‌లైట్ల ఏర్పాటుపై చర్చించారు. అనంతరం గ్రామంలో పర్యటించి 9 చోట్ల ఈ లైట్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో సోలార్ విద్యుత్‌ను అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. రైతులు తమ తోటలలోని పంటలను కోతుల బెడద నుంచి రక్షించుకునేందుకు సోలార్ విద్యుత్ ఫెన్సింగ్ దోహదపడుతుందన్నారు. పంపుసెట్లకు కూడా సోలార్ విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నామని, ఉద్యోగులకు సోలార్ చార్జింగ్ మోటార్‌సైకిళ్లను ఫైనాన్స్‌పై తమ సంస్థ అందజేస్తుందని వీటిని అర్హులైనవారందరూ సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ విజయలక్ష్మి కోరారు. ఈ లైట్లను ఎమ్మెల్యే కన్నబాబు ప్రారంభిస్తారని నెడ్‌క్యాప్ డైరెక్టర్ తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు సాదే వీర్రాఘవు పాల్గొన్నారు.

### 86వ సారి బాదం బాలకృష్ణ రక్తదానం

బోట్‌క్లబ్: లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ బుధవారం స్థానిక లయన్స్ క్లబ్‌లో 86వ సారి రక్తదానం చేశారు. లయన్స్ క్లబ్ కాకినాడ అధ్యక్షులు డి.రామ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బుధవారం లయన్స్ హాల్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 113 మంది రక్తదానం చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా మొదటి గవర్నర్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్, దంగేటి సతీష్, నేరేళ్ల మురళీకృష్ణ పాల్గొన్నారు.

# చురుగ్గా వాకింగ్ ట్రాక్ నిర్మాణం

- రక్షిత నీటి చెరువు చుట్టూ రూ.కోటితో సుందరీకరణ
- ప్రారంభించనున్న ఎమ్మెల్యే కన్నబాబు




రక్షితనీటి చెరువు చుట్టూ నిర్మించిన వాకింగ్ ట్రాక్ వద్ద పని చేస్తున్న కార్మికుడు

కరప: గ్రామంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామంలోని సామూహిక రక్షిత నీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించి, విద్యుద్దీకరించి, పార్కు నిర్మిస్తామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఇచ్చిన హామీ మేరకు రూ.కోటి మంజూరు చేశారు. ఈ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి.

**అందరికీ అవసరం**

ఈ మధ్య కాలంలో చాలామంది ఉదయాన్నే లేచి, ఒకగంట యోగ, నడకవంటి వ్యాయాలు చేయడం అలవాటు చేసుకున్నారు. గ్రామస్తులు హైస్కూలు గ్రౌండ్‌లో నడిచేందుకు వెళుతుంటారు. ప్రస్తుతం ఆ గ్రౌండ్ బాగుండక వెళ్లడం తగ్గించేశారు. కొంతమంది కాకినాడ-రామచంద్రపురం రోడ్డు, కరప-కొరుపల్లి రోడ్డుపైనే వాకింగ్ చేస్తున్నారు. మరికొందరు మంచి నీటి చెరువు చుట్టూ నడక సాగిస్తున్నారు. అయితే ఈ చెరువు చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి, నడవడానికి అసౌకర్యంగా తయారైంది. ప్రజల వినతి మేరకు ఎమ్మెల్యే కన్నబాబు స్పందించి వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. చెరువుచుట్టూ, గ్రావెల్ వేసి, నాలుగు పక్కలా విద్యుత్ స్తంభాలు వేసి, లైట్లు అమర్చారు. కొన్ని కారణాలతో పనులు మధ్యలో ఆగిపోవడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే చొరవ తీసుకుని కాంట్రాక్టర్‌ను పిలిచి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. మెయిన్ రోడ్డు గేట్లు అమర్చి, ఫెన్సింగ్ పనులు చేయాల్సి ఉంది.


**వాకింగ్ ట్రాక్ గ్రామస్తుల కల**



గ్రామంలో రక్షిత నీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ పనులు జాప్యమైనా, తిరిగి మొదలుపెట్టారు, నిధులు సరిపోకపోతే అదనంగా మంజూరుచేస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో పనులు ముగింపు దశకు చేరుకున్నాయి.

– యార్ల సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యుడు, కరప

**ఎమ్మెల్యే కన్నబాబు చొరవతో..**



కరపలో సరైన వాకింగ్ ట్రాక్ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. టీడీపీ నాయకులు నిర్లక్ష్యం చేసినా, ఎమ్మెల్యే కన్నబాబు చొరవతో పనులు ఊపందుకున్నాయి. త్వరలో ఎమ్మెల్యే కన్నబాబుతో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– పెంకే శ్రీలక్ష్మి, ఎంపీపీ కరప మండలం